క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మోత్కూరు : పట్టణంలో మెయిన్‌రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలను తరలింపు నేపథ్యంలో ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి 4.30గంటల వరకు కొత్త బస్టాండ్ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ హుస్సేన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మోత్కూరు : పట్టణంలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో ప్రవేశానికి ఈనెల 12నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వసతిగృహ సంక్షేమ అధికారి ఎం.రమణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను 3వ తరగతి నుంచి 10వతరగతి వరకు బాలురు ఉచిత ప్రవేశాల కోసం ఆధార్, రేషన్‌కార్డులు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, రెండు ఫొటోలతో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9959646811ను సంప్రదించాలని సూచించారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి


ఎంపీ రాజేందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

బీబీనగర్ : ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాన్ని అలవర్చుకోవాలని మల్కాజిగిరి ఎంపీ, మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. మండలంలోని కొండమడుగు గ్రామంలో కొనసాగుతున్న పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవంలో శనివారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పెంటయ్య, వెంకటేష్, రాము, నాగరాజు, గోపాల్, జాంగీర్, బాల్‌రాజు, మహేష్, రాజమల్లేష్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక


నూతన కమిటీని సన్మానిస్తున్న సభ్యులు

రామన్నపేట : సంరక్షణ యూత్ అసోసియేషన్ 19వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలో యూత్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మోటె గణేష్, ఉపాధ్యక్షులుగా కొండె వెంకటేష్, గొరిగె విష్ణు, ప్రధాన కార్యదర్శిగా గొరిగె ప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా చిందం వేణు, బండ మల్లికార్జున్, మోటె బీరప్ప, పల్లె ఉమామహేశ్వర్, ఏనుగు అచ్చాలును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈతాపుల క్రాంతికుమార్, మిర్యాల మల్లేశం, మోటె రమేష్, మహేష్, బండ జీష్, బెడిద శేఖర్, నాగేష్, గణేష్, రమేష్, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు


భిక్షమయ్యగౌడ్‌కు ఉత్సవ జ్ఞాపికను అందజేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట రూరల్ : ఆలేరు పట్టణంలో జరుగుతున్న దుర్గాదేవి ఉత్సవాల్లో ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రంగన్న, మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, బీఆర్ఎస్ నాయకులు తదితరులున్నారు.

పాఠశాలను సందర్శించిన డీఈఓ


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ కె.నారాయణరెడ్డి

రాజాపేట : మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలను శనివారం జిల్లా విద్యాధికారి కె.నారాయణరెడ్డి సందర్శించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాఠశాలను సందర్శిస్తున్న సందర్భంగా పాఠశాలలోని సభావేదికను పరిశీలించి సన్నాహక కార్యక్రమాలపై హెచ్ఎం బూర్గు మహేందర్‌రెడ్డికి పలు సూచనలు చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో నిర్వహిస్తున్న పనుల పురోగతిని, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పదోతరగతి విద్యార్థులతో మాట్లాడి పలు సూచనలు సలహాలు అందజేశారు. ఆయన వెంట ఎంఈఓ జె.కృష్ణ, సీఎంఓ పి.లింగారెడ్డి, బాలికల పాఠశాల హెచ్ఎం కిరణ్మయి, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

నిలిచిన రోడ్డు విస్తరణ పనులు

- 'డబుల్' పనులకు రోడ్డు తవ్వి వదిలేసిన కాంట్రాక్టర్
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- ఏడాదిన్నరగా పట్టించుకోని అధికారులు

చౌటుప్పల్ : ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు, ప్రమాదాల నివారణకు సింగిల్‌గా ఉన్న రహదారిని రెండు వరుసలుగా మార్చేందుకు చేపట్టిన విస్తరణ పనులు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. చౌటుప్పల్ పట్టణం నుంచి వలిగొండ మండలం సంగెం గ్రామం వరకు కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.18కోట్లతో 13.2కిలోమీటర్ల వరకు రెండు వరుసలుగా చేపట్టే నిధులు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో 2022 డిసెంబర్ 24న అప్పటి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి డబుల్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. వెంటనే కాంట్రాక్టర్ పనులను ప్రారంభించి ప్రస్తుతం ఉన్న రోడ్డు వెంట గుంతలు తవ్వి మట్టి, కంకర పోసి వదిలేశాడు. ఈ కొద్దిపాటి పనులతో రాత్రి సమయంలో ఆ రోడ్డు నుంచి ప్రయాణించే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

13.2కిలోమీటర్ల వరకు రోడ్డు విస్తరణ..

చౌటుప్పల్, చిన్నకొండూరు, పెద్దకొండూరు, తమ్మలోనిబావి, సంగెం గ్రామం వరకు 13.2కిలోమీటర్ల దూరం ప్రస్తుతం ఉన్న సింగిల్‌రోడ్డును ప్రభుత్వం రెండు వరుసలుగా మార్చేందుకు నిధులు మంజూరు చేసింది. ఈ నిర్మాణంలో భాగంగా మొదట కల్వర్టుల పనులు చేపట్టారు. అదే విధంగా డబుల్ రోడ్డు కోసం ఇరువైపులా రోడ్డును తవ్వి కంకర, మట్టి కుప్పలు పోశారు. అక్కడక్కడ కొంతమేరకు పనులు చేపట్టి వాటిని పూర్తిచేయకుండానే వదిలేశారు. ఈ విషయాన్ని గత కొన్ని నెలలుగా ఎవరూ పట్టించుకోవడంలేదు.


చౌటుప్పల్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఎదుట రోడ్డును తవ్వి వదిలేసిన కాంట్రాక్టర్


చిన్నకొండూర్ గ్రామశివారులో మూలమలుపు వద్ద ప్రమాదకరంగా మారిన రోడ్డు తవ్వకం

గుంతలతో ప్రమాదాల బారిన పడుతున్నారు..

రోడ్డు విస్తరణ పనులు 2023మే నెలలో ప్రారంభించారు. ఇక అప్పటి నుంచి పనులు ఆగుతూ.. సాగుతున్నాయి. చిన్నకొండూరు, పెద్దకొండూరు గ్రామాలతో పాటు చౌటుప్పల్‌లోని చిన్నకొండూర్ రోడ్డులో సీసీరోడ్డు పనులు పూర్తయ్యాయి. మిగతా ప్రాంతాలలో రెండు వరుసల కోసం కొద్ది రోజుల క్రితం రోడ్డును తవ్వి కంకరపోసి వదిలేశారు. నెలలు గడుస్తున్నా పనులు పూర్తి చేయకుండా ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో అవస్థలు తలెత్తుతున్నాయి. ఆయా ప్రాంతాల్లోని గుంతలు, మట్టి, కంకరకుప్పల మూలంగా వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంటుంది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో, అధికారుల పర్యవేక్షణ లోపంతో అటు వాహనదారులు, ఇటు ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

రాత్రి వేళల్లో ప్రయాణం నరకం



చౌటుప్పల్ నుంచి సంగెం వెళ్లే మార్గంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు ప్రస్తుతం ప్రమాదాలకు కారణంగా మారాయి. నిత్యం ఎక్కడో ఓ చోట ప్రమాదం చోటుచేసుకుంటూనే ఉంది. శంకుస్థాపన జరిగి ఏడాదిన్నర గడుస్తున్నా పనులు పూర్తికాలేదు. ఎక్కడికక్కడ రోడ్డును తవ్వి వదిలేశారు. గుంతలు, కంకర కుప్పల కారణంగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణం నరకంగా మారుతోంది

– దూర్కు కృష్ణ, పెద్దకొండూర్

పట్టించుకునే వారే కరువయ్యారు



డబుల్‌రోడ్డు విస్తరణ పనులు ఎవ్వరూ పట్టించుకోకుండా గాలికివదిలేశారు. కేవలం కల్వర్టులు మాత్రమే పూర్తిచేశారు. మూడు గ్రామాల్లో సీసీరోడ్డు వేశారు. మిగతా పనులు మాత్రం ఎక్కడికక్కడే వదిలేశారు. దీంతో పట్టించుకునే వారే కరువయ్యారు. ఇప్పటి వరకు జరిగిన పనుల్లోనూ నాణ్యతా లోపం కన్పిస్తుంది. ఎన్నిమార్లు చెప్పినా అధికారుల తీరు మారలేదు.

– కాయితి రమేష్‌గౌడ్, మాజీ సర్పంచ్, పెద్దకొండూర్

పోచంపల్లిని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దాం


మాట్లాడుతున్న ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : ఐదేళ్ల కాలంలో ప్రభుత్వ సహకారంతో పోచంపల్లిని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేశామని ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలకు అతీతంగా కోట్ల రూపాయలతో మండలంలోని గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీలు, ఇతర మౌలిక వసతులు కల్పించామన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేశామని, అధికారులు కూడా అభివృద్ధికి సహకరించారని అన్నారు. అంతకు ముందు వివిధ శాఖల ప్రగతినివేదికను అధికారులు చదివి వినిపించారు. ఈసందర్భంగా పలువురు అధికారులు మండలంలోని సమస్యలు, అభివృద్ధిపై వివరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, ఎంపీడీఓ రాపర్తి భాస్కర్, తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, ఎంపీటీసీలు జంగయ్య, బందారపు సుమలత, రావుల శ్రీదేవి, బొక్క అమృతమ్మ, శంకరమ్మ, యాదగిరి, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ : మండలంలోని వెంకటాపురంలో గల శ్రీఅలివేలు మంగ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈనెల 20నుంచి 24వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వాహణాధికారి మోహన్‌బాబు, నాయకులు కొమ్మారెడ్డి నరేష్‌రెడ్డి, కొత్త వెంకటేశం, జక్కల రోశయ్య, అర్చకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఏయిమ్స్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ

బొమ్మలరామారం : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తుగా మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో బీబీనగర్ ఏయిమ్స్ రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది శనివారం యోగాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏయిమ్స్ యోగా టీచర్ నీరజ పీహెచ్‌సీ డాక్టర్ సుమలతతో కలసి మహిళలకు పలు యోగా ఆసనాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఆయుష్ ఫార్మసిస్ట్ శంకర్, ఏఎన్ఎం నూర్జహాన్, విజయ, స్టాఫ్‌నర్స్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


యోగాపై శిక్షణ ఇస్తున్న డాక్టర్ నీరజ

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం


రక్తదాన శిబిరంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, లయన్స్‌క్లబ్ సభ్యులు

రామన్నపేట : రక్తదానం చేయడం ద్వారా మరొకరికి ప్రాణదానం చేసినట్లు అవుతుందని జెడ్పీటీసీ పున్న లక్ష్మీజగన్మోహన్, రామన్నపేట లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సిరిగిరెడ్డి సంజీవరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సిరిపురం గ్రామంలో రామన్నపేట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ వారి సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని, హైదరాబాద్ యశోద ఆసుపత్రి వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా 48మంది దాతలు రక్తదానం చేశారని, వేయి మందికి వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బడుగు రమేష్, తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, జోనల్‌క్లబ్ మెంబర్ బొడ్డు శంకరయ్య, ఉపాధ్యక్షుడు పి.భాస్కర్‌రావు, బి.వెంకటేష్, బి.గోవర్దనాచారి, కె.అనంతరెడ్డి, టి.సూర్యనారాయణ, కె.విజయానందం, జినుకల ప్రభాకర్, జి.అయిలయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, యశోద ఆసుపత్రి మేనేజర్ ఎ.వాసుకిరణ్‌రెడ్డి, క్యాంప్ కోఆర్డినేటర్ శ్రీధర్, రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు ఎన్‌సీవీ రాములు, నిర్మల వివిధ శాఖల వైద్యులు పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

బొమ్మలరామారం : మండలంలోని చీకటిమామిడి గ్రామం నుంచి మర్యాల మీదుగా భువనగిరి మండలంలోని వడపర్తి వరకు రూ.18కోట్ల నిధులతో చేపట్టనున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులను శనివారం కాంగ్రెస్ మండల నాయకులు పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు కాంగ్రెస్ మండల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. శంకుస్థాపన చేసిన మూడు నెలల్లోనే రోడ్డు పనులు ప్రారంభించడంతో ఏళ్ల తరబడి మండల వాసుల ఇబ్బందులు తొలగిపోనున్నాయన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ మోకు మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చీర సత్యనారయణ, నాయకులు దేశెట్టి చంద్రశేఖర్, ముద్దం శ్రీకాంత్‌రెడ్డి, రాజిరెడ్డి, శ్రీశైలం, కృష్ణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేత


ఎస్సెస్సీ విద్యార్థులకు మెమెంటో, నగదు అందజేస్తున్న కృష్ణగౌడ్

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని ఇంద్రియాల గ్రామంలో బండి దయాకర్‌గౌడ్ 5వ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం బండి దయాకర్ చారిటబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2023–24సంవత్సరంలో ఎస్సెస్సీలో టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు నగదు పురస్కారం, మెమెంటోలను మాజీ సర్పంచ్ బండి కృష్ణగౌడ్ చేతుల మీదుగా అందజేశారు. అలాగే పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన ప్లేట్లు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం గురునాథం, నాయకులు ఎర్ర వెంకటేష్, పెద్దిరెడ్డి యాదగిరి, బండిరవి, గడ్డం చంద్రశేఖర్, బీమగాని రాజారాం, గడ్డం శెట్టి, బండి గోవర్దన్, అశోక్, బుచ్చిబాబు, లింగస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక

భూదాన్‌పోచంపల్లి : పట్టణ పరిధిలోని మోడల్ స్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు జాతీయస్థాయి నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ నరేశ్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు దీక్షితాకుమారి, సిరి, ప్రలవి, అక్షయ, చందనకు ప్రతి ఏటా రూ.12వేల చొప్పున మొత్తం నాలుగు సంవత్సరాల పాటు రూ.48వేలు స్కాలర్‌షిప్ అందిస్తారని అన్నారు. ఇప్పటి వరకు మోడల్‌స్కూల్ నుంచి మొత్తం 42 మంది విద్యార్థులు జాతీయస్థాయి స్కాలర్‌షిప్‌లకు ఎంపికయ్యారని తెలిపారు. ఇలా ప్రతి సంవత్సరం పాఠశాల నుంచి విద్యార్థులు ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల విజ్ఞానయాత్ర



విజ్ఞానయాత్రలో పాల్గొన్న విద్యార్థులు

రాజాపేట : ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకంలో భాగంగా మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులంతా శనివారం విజ్ఞాన విహారయాత్రకు వెళ్లారు. ఈ సందర్భంగా వారు గజ్వేల్‌లోని కల్పకవనం, వర్గల్‌లోని జ్ఞానసరస్వతి దేవాలయం, కొండపోచమ్మ సాగర్ డ్యాంలను సందర్శించారు. విజ్ఞాన విహార యాత్రలతో విద్యార్థులకు ప్రకృతి, సంస్కృతి, ఆధ్యాత్మికత పట్ల అవగాహన కలుగుతుందని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

మోత్కూరు : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, పాఠశాలల్లో కల్పిస్తున్న వివిధ రకాల సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని అంగడిబజార్ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతిలో నూతనంగా చేరిన విద్యార్థుల అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన బోధనతో పాటు విద్యార్థులకు ఉచిత భోజనం, దుస్తులు, పాఠ్య పుస్తకాలను ఉచితంగా అందజేస్తారన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి, పాఠశాల హెచ్ఎం ఆర్.రవీందర్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ ఎండీ.జమీలా, ఉపాధ్యాయులు కె.అరుణ, బి.లలిత, కె.సౌజన్య, అంగన్‌వాడీ టీచర్ శోభ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి

గుండాల : ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం చంద్రకళ అన్నారు. శనివారం మండల కేంద్రంలో పాఠశాలలో విద్యార్థుల నమోదు కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులతో మండల కేంద్రంలో ఇంటింటికి తిరిగి మీ పిల్లలను మా బడికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్‌పీ లింగయ్య, ఉపాధ్యాయులు నెర్సిగ్రేసి, హరిత, జగన్, స్వప్న, రవి, భాగ్యలక్ష్మి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


మోత్కూరు : చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి తదితరులు

కొనసాగుతున్న బడిబాట

ఆత్మకూరు(ఎం) : బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట ర్యాలీ నిర్వహించారు.

వలిగొండ : మండలంలోని వర్కట్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బాలిక విద్యా దివస్ పురస్కరించుకొని శనివారం మహిళ సంఘాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం అనీఫ్ అహ్మద్ మాట్లాడుతూ.. బడి బయటి, బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మీసాల సంధ్య, నిర్మల, ఉపాధ్యాయులు మహేశ్వర్, శ్రీనివాస్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరు(ఎం) : కప్రాయపల్లిలో నిర్వహిస్తున్న బడిబాట ర్యాలీ


గుండాల : అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని శిక్షించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మోత్కూరు : పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని కాట్రపల్లి గ్రామంలో ఆరేళ్ల చిన్నారిని ఎత్తుకెళ్లి అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. చిన్నారులపై రోజురోజుకూ జరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలు, హత్యలను అరికట్టాలని అన్నారు. అనంతరం తహసీల్దార్ డి.రాంప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు నిలిగొండ మత్స్యగిరి, చెరుకు ఉప్పలయ్య, చిల్కమర్రి రాము, కుర్మిల్ల నరేష్, అంబటి విజయ్‌కుమార్, రాకేష్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై రైతులకు అవగాహన


రైతులకు బ్యాంకు ఖాతాలు అందజేస్తున్న మేనేజర్

రాజాపేట : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నల్లగొండ జిల్లా సహకార బ్యాంకు సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాజాపేట బ్రాంచ్ మేనేజర్ ఎండీ షరీఫ్, పీఏసీఎస్ చైర్మన్ చింతలపురి భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కుర్రారం గ్రామంలో సహకార బ్యాంకు సేవలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిపాజిట్, సేవింగ్, కరంట్ అకౌంట్, లాకర్, గోల్డ్‌లోన్స్, ఇతర రుణాల వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 50 మంది రైతులకు బ్యాంకు ఖాతాలను అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్‌ఆఫీసర్ టి.లక్ష్మణరావు, పీఏసీఎస్ సెక్రటరీ సిలివేరు శేఖర్, సిబ్బంది వెంకటేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సమస్యలు పరిష్కరించాలని వినతి

అడ్డగూడూరు : ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పల శాంతికుమార్ అన్నారు. పాఠశాలల్లోని సమస్యలు, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజు దోపిడీని అరికట్టాలని సంఘం ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో విద్యావనరుల అధికారి క్రాంతికుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

రాయరావుపేటలో హరితహారం

బీబీనగర్ : మండలంలోని రాయరావుపేట గ్రామంలో స్టేట్ స్ట్రీట్ ఫౌండేషన్, మోటివేషన్ ఇండియా, సుధాకర్ చారిటీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం హరితహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుధాకర్‌గౌడ్, మోటివేషన్ ప్రతినిధులు ప్రవీణ్, శేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయంపై ఉపాధ్యాయుల హర్షం

మోటకొండూర్ : తెలంగాణ ప్రభుత్వం భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల పదోన్నతి, బదిలీలు చేపట్టడం పట్ల రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ రాష్ట్ర నాయకులు గంధమల్ల విశ్వరూపం, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా నాయకులు కొరటికంటి వినోద్‌కుమార్‌గౌడ్ శనివారం హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కేతిరెడ్డి రఘురామ్‌రెడ్డి, ఉపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, సత్యనారాయణ, కృష్ణయ్య, అచంట భాగ్యశ్రీ, అండాలు, సుల్తానా, రేణుక ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

రాజాపేట : ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని బొందుగుల గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొచ్చు మల్లయ్య తన వ్యవసాయ బావి వద్ద పనులు ముగించుకుని తిరిగి ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. అదే క్రమంలో కుర్రారం గ్రామానికి చెందిన ట్రాక్టర్ ఇసుకలోడుతో బొందుగుల గ్రామానికి వచ్చి అన్‌లోడ్ చేసి తిరిగి వెళ్తుండగా గ్రామ శివారులో మల్లయ్య వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో మల్లయ్యకు తీవ్రగాయాలు కావడంతో గుర్తించిన గ్రామస్తులు చికిత్సకు సిద్దిపేటకు తరలించినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల అనుమతి పత్రాల తనిఖీ

ఆత్మకూరు(ఎం) : మండలంలోని కొరటికల్ బిక్కేరువాగు నుంచి ఆత్మకూరు(ఎం)కు ఇసుక రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్ల అనుమతి పత్రాలను ఏఎస్ఐ సైదులు శనివారం తనిఖీ చేశారు. రెవెన్యూ అధికారుల అనుమతి లేనిదే రవాణా చేయెద్దన్నారు.

దరఖాస్తుల్లో పొరపాట్లను సవరించుకోవాలి

మోత్కూరు : ప్రజాపాలనలో వివిధ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు దరఖాస్తుల్లో ఏమైన పొరపాట్లు ఉంటే స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కేంద్రంలో సరిచేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్ శనివారం తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసినందున ప్రజా పాలనలో అందజేసిన దరఖాస్తుల పొరపాట్లను సవరించుకొని పథకాలను పొందాలన్నారు. ప్రస్తుతానికి జీరో విద్యుత్ బిల్లు, గ్యాస్ సబ్సిడీకి సంబంధించిన దరఖాస్తుదారులలో పొరపాట్లు సరిచేయనున్నట్లు తెలిపారు.

పదోన్నతుల్లో న్యాయం చేయాలి

రామన్నపేట : ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు పదోన్నతుల్లో న్యాయం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బోయ రాములు కోరారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల పదోన్నతులు సీనియారిటీ లిస్ట్‌లో ఉన్నప్పటికీ అడక్వసి పేరుతో పదోన్నతి కల్పించడం లేదన్నారు. పదోన్నతులకు అడ్డంకిగా ఉన్న జీఓ 2లోని అడక్వసి పదాన్ని తొలగించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట జిల్లా ఉపాధ్యక్షుడు కట్ట మల్లయ్య, ప్రధాన కార్యదర్శి జనపాల కిషన్ ఉన్నారు.

దుండగులను శిక్షించాలి

భువనగిరి రూరల్ : పట్టణంలోని ఉప్పలమ్మగుడిని ధ్వంసం చేసిన దుండగులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని శనివారం స్థానికంగా హిందూ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కేమోజు మల్లికార్జున్, కోల శ్రీనివాస్ గుప్త, రత్నపురం బల్‌రాం, రత్నపురం శ్రీశైలం, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్ నర్సింహచారి, పత్తి వినోద్, కోళ్ల భిక్షపతి పాల్గొన్నారు. విశ్వహిందూ పరిషత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అరుణ్‌కుమార్ తెలిపారు.

కాంగ్రెస్ ఎన్నికల హామీలను అమలు చేయాలి

మోత్కూరు : అసెంబ్లీ ఎన్నికల్లో వృద్ధులకు, దివ్యాంగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 6 గ్యారంటీలలో ఆసరా పింఛన్ పెంపు ఉందని గుర్తుచేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.